సాక్షి చిత్తూరు
ఆదివారం । 17 । నవంబర్ । 2024



నేను పుట్టాను.. ఈ లోకం మెచ్చింది!

మనుమలు పుట్టినరోజు వేడుకలను జరుపుకోవడం చూస్తుంటాం. కానీ ఓ రైతు తన ఎద్దుకు పుట్టిన రోజు వేడుకలు జరిపాడు. - 8లో



బాలుడిని బలితీసుకున్న ట్రాక్టర్

చిత్తూరు నగరంలో ఇసుక ట్రాక్టర్ ఢీకొని ఓ బాలుడు అక్కడికక్కడే మరణించిన సంఘటన శనివారం ఉదయం జరిగింది. - 8లో



స్కార్పియో దగ్ధం

పలమనేరు సమీపంలోని మొగలిఘాట్ రోడ్డులో స్కార్పియో కారు దగ్ధమైన సంఘటన శనివారం జరిగింది. - 8లో

న్యూస్‌రీల్

కొత్తగా మూడు ప్యాకేజీ టూర్లు

తిరుపతి(అలిపిరి): కార్తీక మాసం సందర్భంగా తిరుపతి నుంచి కొత్తగా మూడు ప్యాకేజీ టూర్లను ప్రవేశపెట్టినట్లు ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ సీహెచ్. శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 17, 24 తేదీలలో ఒక్కరోజు మహానంది, శ్రీశైలం ప్యాకేజీ టూర్ ఉంటుందన్నారు. నాన్ ఏసీ బస్సులో 17, 24 తేదీల్లో ఆదివారం రాత్రి 9 గంటలకు బస్సు బయలుదేరుతుందని పేర్కొన్నారు. బస్సు తిరిగి మూడో రోజు మంగళవారం ఉదయం 6 గంటలకు వస్తుందన్నారు. పెద్దలకు ఒక్కరికి టికెట్ ధర రూ.3,050, పిల్లలకు రూ.2,440 (రవాణ చార్జీ, నాన్ ఏసీ, ఫ్రెషప్, భోజనం, గైడ్ సౌకర్యంతో కలిపి..) ఉంటుందని తెలిపారు. అలాగే తలకోన, శ్రీనివాసమంగాపురం టూర్ ప్యాకేజీకి (ప్రతి ఆది, సోమవారాలు) ఒకరికి రూ.400 (రవాణా చార్జీలు, గైడ్ సౌకర్యంతో కలిపి)లతో ఉంటుందన్నారు. రోజూ ఉదయం 9 గంటలకు బస్సు బయలుదేరి సాయంత్రం 5 గంటలకు తిరిగి చేరుకుంటుందని తెలిపారు. గుడిమల్లం ప్యాకేజీ టూర్‌లో తిరుచానూరు – అప్పలాయగుంట, గుడిమల్లం ఆలయాలకు రోజూ ఒక్కరికి రూ.400 (రవాణా చార్జీ, గైడ్ సౌకర్యంతో కలిపి...) ఉంటుందన్నారు. తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణు నివాసం నుంచి బస్సులు బయలుదేరుతాయని తెలిపారు. ఈ కొత్త ప్యాకేజీ టూర్లను తిరుపతి, చిత్తూరు జిల్లా ప్రజలు, యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు ఫోన్ నంబర్లు 9848007033, 0877–2289123లో సంప్రదించాలని సూచించారు.

19న సంకటహర గణపతి వ్రతం

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో ఈనెల 19వ తేదీన సంకటహర గణపతి వ్రతాన్ని నిర్వహించనున్నట్లు ఈఓ గురుప్రసాద్ తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు సంకటహర గణపతి వ్రతం జరుగుతుందన్నారు. రాత్రి 7 గంటల సమయంలో స్వర్ణ రథోత్సవ సేవ ఉంటుందన్నారు. ఈ సేవలో పాల్గొన్నే భక్తులు ముందస్తుగా ఆన్‌లైన్‌లో టికెట్లు పొందవచ్చని ఆయన పేర్కొన్నారు.

పాలెం చెరువుకు గండి



గండి పూడ్చుతున్న జేసీబీ

సదుం: మండలంలోని తాటిగుంటపాలెం సమీపంలోని పాలెం చెరువుకు గండి పడింది. గ్రామస్తులు, రెవెన్యూ అధికారులకు శనివారం సమాచారం అందజేశారు. తహసీల్దార్ మారుఫ్ హుస్సేన్, వీఆర్వో మహబూబ్ బాషాతో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని, గండిని పరిశీలించారు. జేసీబీ సాయంతో మట్టి తోలి తాత్కాలిక మరమ్మతులకు చర్యలు తీసుకున్నారు. కాగా శాశ్వత మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

2024 జూలై 15

తిరుపతి జిల్లాలోని నాయుడుపేట అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటన చోటుచేసుకుంది. కలుషిత ఆహారం తిన్న ఆ పాఠశాలలోని 89 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు లోనై ఆస్పత్రి పాలయ్యారు. పాడైన ఆహారం తినడంతో విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు వైద్యులు తేల్చిచెప్పారు.



చికిత్స పొందుతున్న నాయుడుపేట గురుకుల విద్యార్థులు (ఫైల్)

2024 ఆగస్టు 12



రేణిగుంట వసతి గృహంలో ఆస్పత్రికి వెళ్తున్న విద్యార్థులు (ఫైల్)

తిరుపతి జిల్లాలోని రేణిగుంట బీసీ బాలుర వసతి గృహంలో ఈ ఫుడ్ పాయిజన్ కారణంగా 21 మంది విద్యార్థులు అస్వస్థతకు లోనయ్యారు. ఆ వసతి గృహంలో కలుషిత ఆహారం తినడంతోనే విద్యార్థులకు వాంతులు, విరేచనాలయ్యి అస్వస్థతకు లోనయ్యారు. ఆ ఘటనను చూసిన తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు.

2024 నవంబర్ 16

తిరుపతి జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటన చోటుచేసుకుంది. కలుషిత ఆహారం తినడంతో 18 మంది బాలికలు అస్వస్థతకు లోనయ్యారు. వారిని వెంటనే రుయా ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. రెండు రోజుల పాటు నిల్వ ఉన్న ఆహారం విద్యార్థులకు పెట్టడంతోనే ఫుడ్ పాయిజన్ జరిగినట్టు అనుమానిస్తున్నారు.



తిరుపతి రుయాలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

తనిఖీలు తూచ్

చిత్తూరు, తిరుపతి జిల్లాలోని వసతిగృహాలు, గురుకుల పాఠశాలల్లో నియమ, నిబంధనల ప్రకారం ఉన్నతాధికారులు తనిఖీలు నిర్వహించడం లేదు. సంక్షేమ శాఖల జిల్లా అధికారులు, డివిజన్ అధికారులు కనీసం నెలలో ఒక్కసారైనా వాటి వైపు కన్నెత్తి చూడడం లేదు. తనిఖీలు లేకపోవడంతో వసతి గృహాల్లో పలు ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్న విమర్శలున్నాయి. పారిశుద్ధ్య నిర్వహణ పనులు సక్రమంగా చేయకపోవడంతో విద్యార్థులు జ్వరాల బారిన పడుతున్నారు. వసతి గృహాలకు వెళ్లి వైద్య చికిత్సలు చేయాల్సిన వైద్యులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. నిబంధనల ప్రకారం ప్రతి నెలా వైద్యులు వసతి గృహాలకు వెళ్లి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను పరీక్షించాలి. అయితే చిత్తూరు, తిరుపతి జిల్లాలో 30 శాతం వసతి గృహాల్లో కూడా అలా జరగడం లేదు. చికిత్సలు చేసినట్టయితే వసతి గృహాల్లో ఉండే రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉంది. కొన్ని వసతి గృహాల్లో రిజిస్టర్లే అమలు చేయకపోవడం కొసమెరుపు.

హాస్టళ్లలో ఆహాకారం

గురుకులాలు, హాస్టళ్ల విద్యార్థులు ఆహాకారాలు పెడుతున్నారు. పాచిన అన్నం, కూరలు వడ్డించడంతో తరచూ ఆస్పత్రులపాలవుతున్నారు. వసతుల లేమి.. కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నరకయాతన అనుభవిస్తున్నారు. అధికారులు కూడా తమకేమీ పట్టనట్టు వ్యవహరించడంతో ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నారు. నాలుగు నెలలుగా జరుగుతున్న వరుస ఘటనలతో తల్లిదండ్రులు సైతం ఆందోళనలో మునిగిపోతున్నారు. అయినా సంబంధిత కూటమి నేతలకు చీమకుట్టినట్టు కూడా లేకపోవడంతో విద్యార్థి సంఘాల నాయకులు రగిలిపోతున్నారు.



తిరుపతి రుయాలో చికిత్స పొందుతున్న గిరిజన గురుకుల బాలికలు

తరచూ ఫుడ్‌పాయిజన్లు, విషజ్వరాలు

- రాత్రి మిగిలిన కూరలను వడ్డిస్తున్న సిబ్బంది
- వసతుల లేమితో అవస్థలు పడుతున్న విద్యార్థులు
- తిరుపతి, చిత్తూరు సంక్షేమ వసతి గృహాల్లో పలు ఘటనలు
- తాజాగా తిరుపతి బైరాగిపట్టెడ గురుకుల పాఠశాలలో ఫుడ్‌పాయిజన్
- వరుస ఘటనలతో బెంబేలెత్తుతున్న తల్లిదండ్రులు
- శాపంగా మారుతున్న అధికారుల పర్యవేక్షణ లేమి

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల అధికారుల పర్యవేక్షణ లోపం విద్యార్థులకు శాపంగా మారింది. రెండు జిల్లాల్లో వరుసగా జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనలు విద్యార్థులు, తల్లిదండ్రుల్లో భయాందోళన కలిగిస్తున్నాయి. వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు అనగానే నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు అందుతాయని తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పిస్తున్నా కానీ ఇటీవల కాలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా జరుగుతున్న వరుస ఘటనలు విద్యార్థుల తల్లిదండ్రులను కలవరపెడుతున్నాయి. చిత్తూరు జిల్లాలో ఎస్టీ, ఎస్సీ, ఏపీఎస్‌డబ్ల్యూఆర్, ఏపీ రెసిడెన్షియల్, ట్రైబల్, కేజీబీవీ, మహాత్మాగాంధీ పూలే, బీసీ సంక్షేమ వసతి గృహాలు 129 వరకు ఉన్నాయి. అలాగే తిరుపతి జిల్లాలో 136 వరకు సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలున్నాయి. చిత్తూరు, తిరుపతి జిల్లాలో వసతి గృహాల్లో, గురుకుల పాఠశాలల్లో 33,283 మంది విద్యార్థులు వసతి పొందుతూ విద్యనభ్యసిస్తున్నారు.

చిత్తూరు, తిరుపతి జిల్లాల సమాచారం

ఏపీ రెసిడెన్షియల్ గురుకులాలు	05
ఏపీఎస్‌డబ్ల్యూఆర్ గురుకులాలు	17
ఏపీ ట్రైబల్ గురుకులాలు	20
ఏపీ బీసీ రెసిడెన్షియల్ గురుకులాలు	12
అన్ని యాజమాన్యాల గురుకులాల్లో విద్యార్థులు	19,879
ఎస్సీ వసతి గృహాలు	119
ఎస్టీ వసతి గృహాలు	55
బీసీ వసతి గృహాలు	91
అన్ని యాజమాన్యాల వసతి గృహాల విద్యార్థులు	13,404

పేద విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కరువు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వసతి గృహాల్లో, గురుకుల పాఠశాలల్లో సమస్యలు అధికమయ్యాయి. అనేక ఘటనలు చోటు చేసుకుంటున్నప్పటికీ కూటమి సర్కారు వాటి బాగోగులపై కన్నెత్తి చూడడం లేదు. ముఖ్యంగా గురుకులాల్లో పరిస్థితి అత్యంత అధ్వానంగా మారింది. వసతి గృహాల్లో ఆహారం సరిగ్గా ఉండడం లేదని, అన్నంలో పురుగులు వస్తున్నాయని, కూరలు కూడా దారుణంగా ఉంటున్నాయని, విద్యార్థులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రతి నెలా వసతిగృహాలు, గురుకుల పాఠశాలల పరిస్థితులపై సమీక్షలు నిర్వహించాల్సిన ఉన్నతాధికారులు అలసత్వం వహిస్తున్నారు. ఈ క్రమంలో చాలా మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురై ఆస్పత్రుల పాలవుతున్నారు.

పౌష్టికాహార లక్ష్యం.. అమలుకు దూరం

తల్లిదండ్రులకు దూరంగా వసతిగృహాల్లో ఉంటున్న పేద విద్యార్థులకు పౌష్టిక విలువలు కలిగిన భోజనం అందించడమే ప్రభుత్వ లక్ష్యం. అయితే ఆ లక్ష్యం సాక్షాత్తు సీఎం చంద్రబాబు నాయుడు సొంత జిల్లాల్లోనే అమలు కాకపోవడంపై విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. పేద పిల్లలకు మెరుగైన విద్యతో పాటు పౌష్టికాహారం ఇవ్వాలి. విద్యార్థులకు పౌష్టికాహారం సంగతి పక్కన పెడితే.. ఉడకని అన్నం, సగం ఉడికిన కూరలు, నిల్వ ఉంచిన ఆహారం పెడుతున్నారు. పక్కాగా అమలు చేయాల్సిన మెనూ గోడలకు మాత్రమే పరిమితం అయ్యింది. రెండు జిల్లాల్లో 80 శాతానికి పైగా వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదు. ఆ విద్యార్థులు తమ ఆవేదనను ఎవరికి చెప్పుకోవాలో తెలియక లోలోన సతమతమవుతూ బక్క చిక్కి పోతున్నారు.

ఇంకెన్ని ఘటనలు జరగాలి?



రెండు జిల్లాల్లో వసతి గృహాల్లో, గురుకుల పాఠశాలల్లో వరుసగా ఘటనలు జరుగుతున్నాయి. అయినప్పటికీ కూటమి ప్రభుత్వం ఏ మాత్రం స్పందించపోవడం దారుణం. గతంలో ఎన్నడూ లేని విధంగా వరుస ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. పేద పిల్లల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ఇలాగేనా వ్యవహరించేది. మా సంఘం ఆధ్వర్యంలో వసతి గృహాల పరిశీలన చేసిన సమయంలో విద్యార్థులు అనేక సమస్యలు చెప్పుకొచ్చారు. మెనూ అమలు కావడం లేదని, నాసిరకం భోజనం పెడుతున్నారని చెప్పారు. ఆ సమస్యలన్ని అధికారులు దృష్టికి సైతం తీసుకెళ్లాం. అయినప్పటికీ మార్పు లేకపోవడం బాధాకరం. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే ఆందోళనలు చేస్తాం.

– శివారెడ్డి, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తిరుపతి జిల్లా


ప్రాణాలు పోతేనే స్పందిస్తారా?



పేద విద్యార్థుల ప్రాణాలు పోతేనే కూటమి ప్రభుత్వం స్పందిస్తుందా?. వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మౌలిక వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టకపోవడం దారుణం. నిల్వ ఉంచి ఆహారం విద్యార్థులకు పెట్టడంతోనే విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారు. సీఎం సొంత జిల్లాల్లో ఇలాంటి ఘటనలు జరగడంతో పరిపాలన ఎలా ఉందన్న విషయం అర్థమవుతోంది. తీరు మార్చుకుని పేద పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి.

– నాగరాజు, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు, చిత్తూరు జిల్లా

డాక్టరేట్లు!



- కూటమి ప్రభుత్వం రాగానే మళ్లీ తెరపైకి
- ద్రవిడ వర్సిటీని భ్రష్టుపట్టిస్తున్న పీహెచ్‌డీలు
- రూ.లక్షలు తీసుకుని అనర్హులకు కట్టబెడుతున్న వైనం
- 2009లోనే సర్టిఫికెట్ల పంపిణీని నిలిపివేసిన దూరవిద్యాకేంద్రం

కాసులుంటే చాలు.. చదువుకోవాల్సిన పనే లేదు. లంచమిస్తే చాలు.. డాక్టరేట్ పట్టానే మన చేతిలోకొచ్చి పడుతుంది. ఇదెక్కడో కాదండోయ్.. కుప్పం ద్రవిడ వర్సిటీ దూర విద్యాకేంద్రంలో. పీహెచ్‌డీల ప్రదానంలో వివాదాలకు కేంద్రబిందువుగా ఉన్న ద్రవిడ వర్సిటీలో మళ్లీ డాక్ట'రేట్ల' పంపిణీ కలకలం రేపుతోంది. 2009లో యూజీసీ రద్దు చేసిన ఈ వ్యవస్థను కూటమి ప్రభుత్వం రాగానే మళ్లీ తెరపైకి తేవడం విమర్శలకు తావిస్తోంది.

2009 యూజీసీ తీసుకొచ్చిన నిబంధనల ప్రకారం దూరవిద్యా కేంద్రం పీహెచ్‌డీలను నిలిపివేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వైస్ చాన్స్‌లర్, రిజిస్ట్రార్‌లు పీహెచ్‌డీలు ప్రదానం చేసేందుకు మళ్లీ శ్రీకారం చుట్టారు. దీంతో యునివర్సిటీ పీహెచ్‌డీల గోల తెరమీదకు వచ్చింది. ఈ సర్టిఫికెట్ల కోసం లక్షల్లో వసూలు చేస్తున్నారని సమాచారం. ఈ వ్యవహారంలో వర్సిటీలో లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న ఓ అధికారి కీలకంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. వర్సిటీలో పీహెచ్‌డీల మంజూరులో అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని ఏపీ పేరెంట్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఇటీవల బహిరంగ లేఖను విడదుల చేసింది.

కుప్పం: పట్టణానికి సమీపంలోని ద్రవిడ విశ్వవిద్యాలయం వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. పరిశోధనలను పక్కన పెడితే అవకతవకలకు, రాజకీయాలకు కేంద్రంగా సాగుతోంది. అధికార పార్టీకి అనుకూలమైన వారికి అక్రమంగా పదోన్నతులు కల్పిస్తూ వివాదాలకు ఆజ్యంపోస్తోంది. దీంతోపాటు వర్గపోరుతో వర్సిటీ పాలన చతికిలపడింది. విద్యాకేంద్రాన్ని రాజకీయాలతో భ్రష్టు పట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

విధుల కన్నా ఇతర వ్యాపకాలపైనే ఆసక్తి

వర్సిటీ రెగ్యులర్ ఉద్యోగులు 42 మంది, బోధన సిబ్బంది 72 మంది, బోధనేతర సిబ్బంది 280 మంది పనిచేస్తున్నారు. 18 విభాగాల్లో 394 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. వీటిలో 10 శాఖలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయి. దీంతో ఉద్యోగులు వర్సిటీలో విధుల కన్నా కుప్పం పట్టణంలో ఇతర వ్యాపకాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం వర్సిటీ వెళ్లి ఆయా శాఖల్లో హాజరు పట్టికలో సంతకాలు పెట్టి తిరిగి సొంత వ్యాపారాల్లో నిమగ్నమవుతున్నారు. గతంలో 3 వేల మంది విద్యార్థులతో కళకళడుతుండే వర్సిటీ నేడు 300 మంది విద్యార్థులకే పరిమితమైంది.

రాజకీయాలకు వేదిక

విద్యా కేంద్రంగా ఉన్న ద్రవిడ యూనివర్సిటీ కూటమి ప్రభుత్వం రాగానే రాజకీయాలకు వేదికగా మారింది. కూటమి పార్టీల కార్యక్రమాలు క్యాంపస్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా టీడీపీ సభ్యత్వం తీసుకోవాలని వర్సిటీలో పనిచేస్తున్న ఓ ఉన్నతాధికారి ఉద్యోగులపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు సమాచారం. కుప్పం నియోజకవర్గ స్థాయి టీడీపీ నాయకుడితో క్యాంపస్‌లో సమావేశాలు పెట్టి ఉద్యోగులతో సమావేశాలు నిర్వహిస్తూ విద్యాసంస్థను భ్రష్టుపట్టించారనే ఆరోపణలు ఉన్నాయి.

నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు



ద్రవిడ విశ్వవిద్యాలయం

ద్రవిడ వర్సిటీలో అసిస్టెంట్ లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న ఓ ఉద్యోగి నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగం పొందారని ఏసీబీ విచారణలో బయటపడింది. నకిలీ సర్టిఫికెట్ల విచారణ 2012 నుంచి కొనసాగింది. ఇదే విషయాన్ని హైకోర్టు సైతం ఏసీబీ విచారణను ధ్రువీకరిస్తూ సంబంధిత ఉద్యోగిని తొలగించి, అప్పట్లో ఉన్న వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్‌తో పాటు సెలెక్షన్ కమిటీ సభ్యులపై కేసు నమోదు చేయాలని ఆదేశించింది. దీంతో వర్సిటీలో నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు ఇవ్వడం పట్ల చర్చనీయాంశంగా మారింది. కొన్ని ఏళ్లుగా సాగుతున్న ఈ విచారణలో అసలు విషయం బయట పడడంతో యునివర్సిటీ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

వర్గ పోరుతో చతికిలపడ్డ పాలన

ద్రవిడ వర్సిటీలో పనిచేస్తున్న ఉన్నతాధికార్లు, సిబ్బంది మధ్య వర్గపోరు తారస్థాయికి చేరింది. గతంలో వీసీ, రిజిస్ట్రార్‌గా పనిచేసిన వారికి, ప్రస్తుతం పనిచేస్తున్న వారికి మధ్య వర్గ పోరు సాగుతోంది. వర్సిటీ ఇంజినీరింగ్ విభాగాల్లో పదోన్నతులు సైతం రాత్రికిరాత్రే అప్పగించారు. అర్హత లేకపోయినా అయినా వారికి పెద్దపీట వేస్తున్నారు. దీంతో వర్సిటీ అభివృద్ధి కంటే స్వప్రయోజనాలకే ప్రాధాన్యత కల్పిస్తున్నారు.

పీహెచ్‌డీలతో వర్సిటీ అప్రతిష్టపాలు

పీహెచ్‌డీల మంజూరులో వర్సిటీ అప్రతిష్టను మూటగట్టుకుంది. యూనివర్సిటీ ఆధ్వర్యంలో దూరవిద్యను ప్రవేశపెట్టి పీహెచ్‌డీలను ఇష్టానుసారంగా మంజూరు చేసేది. లక్షలు వసూలు చేసుకుని డాక్టరేట్లను ప్రదానం చేశారని అప్పట్లో పెద్ద ఎత్తున జాతీయ స్థాయిలో ఆరోపణలు వెల్లువెత్తాయి.

2009 యూజీసీ తీసుకొచ్చిన నిబంధనల ప్రకారం దూరవిద్యా కేంద్రం పీహెచ్‌డీలను నిలిపివేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వైస్ చాన్స్‌లర్, రిజిస్ట్రార్‌లు పీహెచ్‌డీలు ప్రదానం చేసేందుకు మళ్లీ శ్రీకారం చుట్టారు. దీంతో యునివర్సిటీ పీహెచ్‌డీల గోల తెరమీదకు వచ్చింది. ఈ సర్టిఫికెట్ల కోసం లక్షల్లో వసూలు చేస్తున్నారని సమాచారం. ఈ వ్యవహారంలో వర్సిటీలో లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న ఓ అధికారి కీలకంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. వర్సిటీలో పీహెచ్‌డీల మంజూరులో అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని ఏపీ పేరెంట్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఇటీవల బహిరంగ లేఖను విడుదల చేసింది.

రాష్ట్రీయ బాల స్వస్థ అమలులో అలసత్వం వొద్దు

- సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో నిర్వహిస్తున్న రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం అమలులో ఎలాంటి అలసత్వం వహించవద్దని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ చైల్డ్ హెల్త్ స్క్రీనింగ్‌లో రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమాన్ని డీఈఓ, ఐసీడీఎస్ పీడీల సమన్వయంతో డీఎంఅండ్‌హెచ్ఓ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎంఈఓ, సీడీపీఓ, వైద్యాధికారులు 0–6, 7–18 ఏళ్ల మధ్య పిల్లలకు ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమం నిర్వహణలో 0–6 సంవత్సరాల మధ్య పిల్లలకు సంబంధించి ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్, 7–18 సంవత్సరాల మధ్య పిల్లలకు సంబంధించి డీఈఓ బాధ్యత తీసుకోవాలన్నారు. చైల్డ్ హెల్త్ స్క్రీనింగ్‌లో ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న పిల్లలున్నట్‌లైతే మెరుగైన వైద్యసేవలకు డీఎంఅండ్‌హెచ్ఓకు సిఫార్సు చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 2,420 అంగన్‌వాడీ కేంద్రాల్లో 54,293 మంది పిల్లలు, 2,470 పాఠశాలల్లో 1,48,483 మంది విద్యార్థులకు స్క్రీనింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ఈ నెల 16వ తేదీ నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు నాలుగు రకాల లోపాలపై ప్రతి శనివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు స్క్రీనింగ్ చేస్తారన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో ఈ కార్యక్రమాన్ని వంద శాతం విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డీఎంఅండ్‌హెచ్ఓ హనుమంతరావు, జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు, ఐసీడీఎస్ పీడీ హైమావతి, డీఈఓ వరలక్ష్మి, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

అసెంబ్లీ సాక్షిగా తప్పుడు ప్రచారం బట్టబయలు

మాజీ మంత్రి ఆర్కే రోజా వెల్లడి

నగరి: వలంటీర్ల ద్వారా రాష్ట్రంలో 30 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారంటూ చంద్రబాబు, పవన్ చేసిన ప్రచారం అసెంబ్లీ సాక్షిగా పచ్చి అబద్ధమని తేలిందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి ఆర్కే రోజా వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ ఐదేళ్లలో పాలనలో మహిళల అక్రమ రవాణాకు సంబంధించి 34 కేసులు మాత్రమే నమోదయ్యాయని సాక్షాత్తు హోంమంత్రే అసెంబ్లీలో ఓ ప్రశ్నకు సమాధానంగా లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారని తెలిపారు. గతంలోనే మిస్సింగ్ కేసుల్లో 99.5 శాతానికి పైగా మహిళలను గుర్తించారని కేంద్ర హోంశాఖ సైతం పార్లమెంట్‌లో స్పష్టం చేసినట్టు గుర్తు చేశారు. తప్పుడు ప్రచారాలు చేసే చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఆత్మ విమర్శ చేసుకోవాలని హితవు పలికారు. అధికారం కోసం ఎంతటి అబద్ధాలకైనా దిగజారుతారా? అని ప్రశ్నించారు.



క్లుప్తంగా

పంటలపై ఏనుగుల దాడి



ఏనుగులు తొక్కి వేసిన వరి పంట

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని మతుకువారిపల్లె పంచాయతీలో శనివారం తెల్ల వారు జామున ఏనుగుల గుంపు కోత కొచ్చిన వరి పంటను ధ్వంసం చేశాయి. అలాగే కరీం అనే రైతు మామిడి తోట చుట్టూ ఉన్న ముళ్ల కంచెను తొక్కేసి అందులోని కూసాలను విరిచేశాయి. మామిడికొమ్మలను విరిచి వేశాయి.

గణనాథుని సేవలో కర్ణాటక హైకోర్టు జడ్జి



చిత్రపటం అందుకుంటున్న జడ్జి అశోక్

కాణిపాకం: శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని శనివారం కర్ణాటకహైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అశోక్ ఎస్ కినాగి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. వేద ఆశీర్వచన మండపంలో పండితులు వారికి ఆశీర్వచనాలు పలికి, ప్రసాదం, స్వామి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ రవీంద్ర బాబు, సిబ్బంది కోదండపాణి, చిట్టిబాబు, ఎస్ఐ ధరణీధర పాల్గొన్నారు.

నేను పుట్టాను.. ఈ లోకం మెచ్చింది!

ధీరత్వానికి.. పరాక్రమానికి.. సమరోత్సాహానికి ప్రతీక ఆ వృషభం.. మైలేరు..జల్లికట్టు ఏదైనా సై.. విజయం.. దానికే సొంతం. ఆ ఎద్దు పోటీలకు వస్తుందంటే నిర్వాహకులకు హడల్.. అందుకే ఆ వృషభరాజం రాజసానికి పలువురు ఫిదా.. మస్తు ఫ్యాన్స్.. ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ఎక్స్ అకౌంట్లు దాని ప్రత్యేకం. ఈ క్రమంలోనే పుట్టిన రోజు వేడుకలు.. అదే వీరభద్ర స్పెషల్.

- ఎద్దుకు ఘనంగా పుట్టినరోజు వేడుకలు
- ఏడేళ్లుగా కుటుంబ సభ్యుడిలా మారిన వృషభం వీరభద్ర
- మైలేర్లు, జల్లికట్లలో స్పీడ్‌స్టార్‌గా గుర్తింపు
- ఇప్పటికే పది మైలేర్లలో రూ.7లక్షల బహుమతులు
- పలుచోట్ల బంగారు పతకాలు కైవసం
- ఆ ఎద్దు ఖరీదు రూ.20 లక్షలకు పైమాటే

పలమనేరు: సాధారణంగా మనుషులు పుట్టినరోజు వేడుకలను జరుపుకోవడం చూస్తుంటాం. కొందరు వారి ఇళ్లలోని పెంపుడు జంతువైన కుక్కలకు సైతం ఇలాంటి వేడుకలను చేసుకుంటారు. కానీ ఓ రైతు తన ఎద్దుకు భారీగా పుట్టిన రోజు వేడుకలను గ్రామస్తులతో కలసి ఘనంగా నిర్వహించడం విడ్డూరంగా మారింది. ఈ సంఘటన బైరెడ్డిపల్లె మండలం రామనపల్లెలో శనివారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలాఉన్నాయి. రామనపల్లి గ్రామానికి చెందిన రఘురామిరెడ్డి అనే రైతు కుటుంబం తరతరాలుగా పండుగ ఎద్దులను ఇంట్లో పోషించి, వాటిని మైలేర్లు, జల్లికట్లకు పంపడం ఆనవాయితీగా వస్తోంది. మారిన కాల పరిస్థితుల కారణంగా వీరు ఈ పట్టింపును కొన్నేళ్లు వదిలిపెట్టారు. ఆపై అతని కుమారుడు మధుసూదన్‌రెడ్డి కోరిక మేరకు ఏడేళ్ల క్రితం వి.కోట మండలం ఎర్రినాగేపల్లెలో ఓ మైలేరు ఎద్దును కొని ఇంటికి తీసుకొచ్చి, పోషించి, దానికి మైలేర్లు, జల్లికట్టు శిక్షణ ఇస్తూ వచ్చారు. ఈ ఎద్దుకు రఘురామిరెడ్డి తన ఇంటి కులదైవమైన వీరభద్రుని పేరు పెట్టారు. 2020 నుంచి ఈ ఎద్దును జిల్లాలోనే కాకుండా పొరుగునే ఉన్న తమిళనాడులో జరిగే జల్లికట్టు పోటీలకు కూడా పంపేవారు. ఈ నేపథ్యంలో ఈ ఎద్దు మండిపేట, కొలమాసనపల్లె, వేపనపల్లె, గుంటూరు, కల్లాడు, చెత్తపెంట, మోటూరు, దొడ్డిపల్లె, వలకాళి, కూటాల్‌వంక, పడవేడు, నాగంధి, పసలమంద, పాలాటూరు తదితర చోట్ల జరిగిన ఎద్దల పోటీల్లో పలు బహుమతులను పొందింది. దీంతో ఆ ఎద్దు పేరు రెండు రాష్ట్రాల్లో ఇప్పుడు మారుమోగుతోంది. దీంతో ఇది మైలేర్లలో వీరభద్ర ఎక్స్‌ప్రెస్‌గా మారింది. ఇప్పటిదాకా మైలేర్లు, జల్లికట్లలో ఇది రూ.7లక్షల నగదు, 8 గ్రాముల బంగారు నాణేలను బహుమతులుగా పొందింది.



వీరభద్ర ఎద్దును తోలుకొస్తున్న రైతు రఘురామి రెడ్డి

ఇప్పుడు ఆ ఎద్దు ఖరీదు రూ.20 లక్షలకు పైమాటే..

రెండు రాష్ట్రాల్లోనూ మైలేర్లలో భారీగా బహుమతులు సాధిస్తున్న ఎద్దుకు భారీగా డిమాండ్ పెరిగింది. దీంతో ఆ ఎద్దు ఖరీదు ఇప్పుడు రూ.20 లక్షలకు పెరిగింది. అయినా ఆ యజమాని దాన్ని అమ్మడానికి ఇష్టపడడం లేదు. ఇప్పుడు పొరుగు రాష్ట్రాల్లో సైతం వీరభద్ర ఎక్స్‌ప్రెస్ వస్తోందంటే ఇక ఫస్ట్ ప్రైజ్ దానికేబ్బా అనేమాట వినిపిస్తోంది.

ఘనంగా పుట్టిన రోజు వేడుకలు

తమ గ్రామానికి పేరు తెచ్చిన ఈ వీరభద్ర ఎక్స్‌ప్రెస్ ఎద్దుకు ఆ కుటుంబసభ్యులు, అభిమానులు కలిసి శనివారం రైతు స్వగ్రామమైన రామనపల్లెలో భారీగా అలకరించి, దానికి కళ్లజోడు పెట్టి, కేక్ కట్‌చేసి పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. తమ కుటుంబ సభ్యునివలే ఆ వృషభాన్ని భావించి ఈ వేడుకలను చేసినట్టు కుటుంసభ్యులు తెలిపారు. ఈ ఎద్దుకు సంబంధించిన వ్యవహారాలను చూసేందుకు మండల కేంద్రమైన బైరెడ్డిపల్లెలో ఓ కార్యాలయాన్ని సైతం నిర్వాహకులు పెట్టారంటే ఆ ఎద్దుకున్న క్రేజ్‌ను అర్థం చేసుకోవచ్చు. ఏదేమైనా ఈ ప్రాంతంలో మైలేరు ఎద్దులకున్న గొప్పతనం అంతా ఇంతా కాదనేమాట వినిపిస్తోంది.

ఈ ఎద్దుకు వేలాదిమంది ఫ్యాన్స్

ఇప్పుడు వీరభద్ర ఎద్దుకు వేలాదిమంది ఫ్యాన్స్‌గా మారిపోయారు. ఆ ఎద్దు ఎక్కడ పోటీలకు వెళ్లినా వీరంతా యూనిఫామ్ వేసుకుని ఎద్దుతోపాటు వెళుతున్నారు. ఈ ఎద్దుకు వీరభద్ర ఎక్స్‌ప్రెస్ పేరిట ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ఎక్స్ అకౌంట్లున్నాయంటే అర్థం చేసుకోవచ్చు. దీంతోపాటు వాట్సాప్ గ్రూపుల్లోని ఎద్దు ఎక్కడ పోటీకెళుతుంది, ఎక్కడికి యూత్ రావాలి అనే అంశాలు సైతం అప్‌డేట్ చేస్తున్నారు.

మహిళ మెడలో చైను లాక్కెళ్లిన ఆర్టీసీ ఉద్యోగి

వెంబడించి పట్టుకున్న యువకులు



పుంగనూరులో దొంగను పట్టుకున్న యువకులు

పుంగనూరు: ఓ ఆర్టీసి ఉద్యోగి హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనంపై వెళుతూ మహిళ మెడలో చైను లాకెళుతుండగా అతడిని యువకులు వెంబడించి, పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన గోవర్దన్ భార్య మాధవీలత కోనేటి వద్ద ఉన్న శివాలయంలో పౌర్ణమి పూజలు చేసేందుకు వచ్చింది. పూజలు చేసుకుని, తిరిగి ఇంటికి వెళుతుండగా మండలంలోని పత్రపల్లెకు చెందిన బాలానీనాయక్ కుమారుడు ప్రసాద్‌నాయక్ ద్విచక్రవాహనంలో వెనుక నుంచి వచ్చి మాధవీలత మెడలోని 32 గ్రాముల బంగారు చైనును లాక్కెళ్లాడు. ఆమె కేకలు వేయడంతో అక్కడే ఉన్న యువకులు ప్రసాద్‌నాయక్ వాహనాన్ని వెంబడించి పట్టుకుని, అతని వద్ద నున్న బంగారు చైను, ద్విచక్ర వాహనాన్ని పోలీసులకు అప్పగించారు. కాగా గత పది రోజులుగా పుంగనూరులో నాలుగు చైను స్నాచింగ్‌లు జరిగాయి. ఇవి అన్ని ప్రసాద్ నాయక్ చేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. దీనిపై విచారణ చేపట్టారు. చైన్ స్నాచర్లను పట్టుకోవడంతో పట్టణ ప్రజలు యువకులను అభినందిస్తున్నారు.

యువకుడిపై దాడి కేసులో ఒకరి అరెస్టు

చిత్తూరు అర్బన్: నగరంలో నడిరోడ్డుపై ఓ యుకుడిని చావబాదిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. వన్‌టౌన్ సీఐ జయరామయ్య కథనం మేరకు.. ఎంఎస్ఆర్ కూడలిలో ద్విచక్రవాహనానికి అడ్డొచ్చాడనే నెపంతో ప్రవీణ్‌తేజ్ అనే వ్యక్తిపై మరో వ్యక్తి ఈనెల 14వ తేదీన అకారణంగా దాడి చేశాడు. ఈ ఘటనలో ప్రవీణ్‌తేజ్ గాయపడ్డాడు. ఇతని ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు, దాడి చేసిన యువకుడు నగరంలోని శంకరయ్యగుంటకు చెందిన సంతోష్‌గా గుర్తించారు. శనివారం అతడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : డీఎస్సీ రాసే అభ్యర్థుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని బీసీ వెల్ఫేర్ డీడీ రబ్బానీ బాషా అన్నారు. శనివారం పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల వద్ద ఉన్న నూతన పూలే భవనంలో డీఎస్సీ ఉచిత శిక్షణను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా డీఎస్సీకి సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 60 రోజుల పాటు 220 మంది అభ్యర్థులకు శిక్షణ ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏబీసీడబ్ల్యూ మనీంద్రయ్య, వాసంతి, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, సూపరింటెండెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణను ప్రారంభిస్తున్న రబ్బానీబాషా

అరగొండలో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

తవణంపల్లె: అరగొండ బాలుర హైస్కూల్ క్రీడామైదానంలో 68వ రాష్ట్రస్థాయి అండర్–14 సాఫ్ట్‌బాల్ బాలబాలికల టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి స్పష్టం చేశారు. శనివారం మండలంలోని అరగొండ బాలుర హైస్కూల్, అరగొండ బాలికల హైస్కూల్, వినాయక విద్యామందిర్ స్కూల్‌ను తనిఖీ చేశారు. పాఠశాలల్లో రికార్డులను పరిశీలించారు. అనంతరం సాఫ్ట్‌బాల్ బాలబాలికల టోర్నమెంట్ పోటీలు నిర్వహణకు పాఠశాలల్లోని క్రీడామైదానాలను పరిశీలించారు. ఈ నెల 16వ తేదీ నుంచి జరగాల్సిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు వర్షాల కారణంగా మార్పు చేసినట్లు వెల్లడించారు. ఈ నెల 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు అరగొండ బాలుర హైస్కూల్ క్రీడామైదానం, అరగొండ టోటల్ హెల్త్ క్రీడా మైదానంలో అండర్–14 బాలురకు, వినాయక విద్యామందిర్ క్రీడామైదానంలో అండర్–14 బాలికలకు సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. డీఈఓతో పాటు తవణంపల్లె ఎంఈఓ త్యాగరాజులు రెడ్డి, సూపరింటెండెంట్ రామకుమార్, సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ ఆర్గనైజర్ కృష్ణ, ప్రధానోపాధ్యాయులు భువనేశ్వరి, మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.



సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ పోటీలు నిర్వహణపై చర్చిస్తున్న డీఈఓ వరలక్ష్మి

చంద్రయాన్-3 వర్కింగ్‌కు ఐజాక్ శ్యాముల్ ఎంపిక



చంద్రయాన్-3 వర్కింగ్ మోడల్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థి, సైన్స్ ఉపాధ్యాయులు

పాలసముద్రం : మండలంలోని బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థి సర్వేపల్లి ఐజాక్ శ్యాముల్ అనే విద్యార్థి చంద్రయాన్-3 వర్కింగ్‌కు ఎంపికయ్యారని శనివారం ఇన్‌ఛార్జి హెచ్ఎం రఘు తెలిపారు. తిరుపతిలో రెండు రోజుల పాటు జరిగిన జరిగిన రీజినల్ సైన్స్ అండ్ సైన్స్ ఫెస్టివల్‌లో వనదుర్గాపురం సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ మనీస్ కుమారుడు సర్వేపల్లి ఐజాక్ శ్యాముల్, సైన్ ఉపాధ్యాయులు శ్రీనివాసులు చంద్రయాన్-3 వర్కింగ్ మోడల్‌ను ప్రదర్శించారు. ఈ మేరకు వీరు చంద్రయాన్- 3 వర్కింగ్‌కు ఎంపికైనట్లు ఎగ్జిబిషన్ నిర్వహకులు తెలిపారు. చంద్రయాన్-3 వర్కింగ్‌కు ఎంపికైన విద్యార్థిని టీచర్లు, గ్రామ పెద్దలు అభినందించారు.

మొగిలి ఘాట్‌లో స్కార్పియో దగ్ధం

- కారులోని ఏడుగురు క్షేమం
- సాంకేతిక లోపంతో వ్యాపించిన మంటలు



పలమనేరు: పట్టణానికి సమీపంలోని మొగిలి ఘాట్‌లో జగరమర్ల మలుపు వద్ద స్కార్పియో కారు దగ్ధమైన సంఘటన శనివారం జరిగింది. అయితే కారు డ్రైవర్ ప్రమాదాన్ని పసిగట్టి కారును రోడ్డు పక్కన ఆపి, అందులోని ఏడుగురిని కిందకు దించడంతో పెను ప్రమాదం తప్పింది. కర్ణాటక రాష్ట్రం ముళబాగిల్‌కు చెందిన ఓ కుటుంబం తమిళనాడు రాష్ట్రంలోని తిరువణ్ణామలైలో కార్తీక పౌర్ణమి సందర్భంగా గిరిప్రదక్షిణకు శుక్రవారం వెళ్లారు. శనివారం ఉదయం అక్కడ బయలుదేరి ముళబాగిల్‌కు వస్తుండగా మొగిలి ఘాట్‌లో ఉన్నట్టుండి కారులోని ఏసీ ద్వారా మంటలు రావడాన్ని డ్రైవర్ రమేష్ గుర్తించాడు. దీంతో కారును పక్కన నిలిపివేసి అందులోని శంకరప్ప కుటుంబానికి చెందిన ఏడుగురిని కిందకు దింపి కారులో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించాడు. కానీ వీలుకాక స్థానిక అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న వారు మంటలను అదుపుచేశారు. ఆ ఈశ్వరుడే తమ ప్రాణాలను కాపాడారంటూ కారులోని కుటుంబసభ్యులు తెలిపారు. కారును ఎక్కువ దూరం ఆపకుండా నడిపిన కారణంగా సాంకేతిక లోపం తలెత్తి మంటల వ్యాప్తికి కారణమైందని అనుమానం వ్యక్తమవుతోంది.

విద్యతోనే కులవివక్షకు విముక్తి

కార్వేటినగరం: ఉన్నత విద్యతోనే కుల వివక్షకు విముక్తి లభిస్తుందని నగరి ఆర్డీఓ భవానీశంకర్ అన్నారు. శనివారం స్థానిక శ్రీలక్ష్మీనరసింహ జూనియర్ కళాశాల ఆవరణలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కుల వివక్షత, సైబర్ నేరాలపై ఒక్కరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్డీఓ భవానీశంకర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించినప్పుడే అంటరానితనాన్ని పూర్తిగా రూపుమాపవచ్చన్నారు. విద్యార్థి దశ నుంచి భారత రాజ్యాంగంపై, ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన పెంచుకుని, వాటిని రూపుమాపాలని సూచించారు. అలాగే విద్యార్థులు డాక్టర్ అంబేడ్కర్, అబ్దుల్‌కలాంను ఆదర్శంగా తీసుకుని, వారి అడుగు జాడల్లో నడుచుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నతవిద్యతో ఉద్యోగాల్లో రాణించి ఆర్థికంగా ఎదిగినప్పుడే కుల వ్యత్యాసాలు దూరమవుతాయన్నారు. అనంతరం చిత్తూరు డీఎస్పీ పద్మలత మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ చట్టం కింద తప్పుడు కేసులు నమోదు చేయడం మానుకోవాలని, చట్టం ప్రాముఖ్యతను పలచన చేయడంతో నిజమైన బాధితులకు అన్యాయం జరుగుతుందన్నారు. అనంతరం సీఐడీ తిరుపతి డీఎస్పీ వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యార్థుల ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యమని, ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాలను సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా ఎదిగి సమాజంలో గుర్తింపు పొందాలని పిలుపునిచ్చారు. ఎస్‌డీపీఓ సాయినాథ్ మాట్లాడుతూ పౌరులకు భారత రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛా స్వాతంత్ర్యం, హక్కులు, చట్టపరమైన రక్షణ, ప్రస్తుత చట్టాలకు మూల బిందువు భారత రాజ్యాంగమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ ఈడీ రాజ్యలక్ష్మి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి ఎస్.మూర్తి, సీఐ హనుమంతప్ప, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ చంద్రమౌళి, ఎస్ఐ రాజ్‌కుమార్, ప్రిన్సిపల్ దిలీప్‌కుమార్, డీటీ స్వరూపారాణి, వీఆర్వో తేజ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ భవాని శంకర్

బాలుడిని బలితీసుకున్న ఇసుక ట్రాక్టర్

- తల్లితో కలిసి స్కూల్‌కు వెళుతుండగా ఢీకొట్టిన ట్రాక్టర్
- బాలుడి మీదుగా ట్రాక్టర్ నడవడంతో అక్కడికక్కడే దుర్మరణం
- జిల్లా కేంద్రం చిత్తూరులో విషాదం

చిత్తూరు అర్బన్: రోజూలానే స్కూలుకు బయలుదేరిన ఆ చిన్నారిని ఎదురుగా వచ్చిన ఇసుక ట్రాక్టర్ బలితీసుకుంది. పది నిమిషాల కిందటే గోరుముద్దలు తినిపించి బడికి తీసుకెళుతున్న కుమారుడిని మృత్యు రూపంలో వచ్చిన ఇసుక ట్రాక్టర్ తన కళ్లెదుటే చంపేయడంతో తల్లి తల్లడిల్లుతోంది. తండ్రి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు. ఈ విషాద ఘటన చిత్తూరులో శనివారం జరిగింది. చిత్తూరు నగరంలోని గిరింపేటకు చెందిన కిరణ్, స్వప్న దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. కిరణ్ ఓ హోటల్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్నారు. స్వప్న గృహిణి. కొంగారెడ్డిపల్లెలోని ఓ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న జయనిరూప్‌ను పాఠశాలలో వదలడానికి స్వప్న తన స్కూటర్‌పై ఎక్కించుకుని బయలుదేరారు. ఫారెస్టు రోడ్డులోని విద్యుత్ స్టేషన్ వద్ద అతివేగంగా ఎదురుగా వచ్చిన ఇసుక ట్రాక్టర్.. స్వప్న స్కూటర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కిందపడ్డ జయనిరూప్ తలమీదుగా ట్రాక్టర్ చక్రం నడవడంతో అతడు అక్కడికక్కడే మరణించాడు. కళ్లెదుటే జరిగిన దారుణంతో స్వప్న గుండెలు బాదుకుని రోదించడం అందరికంట తడిపెట్టించింది. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు జయనిరూప్ మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఇసుక ట్రాక్టర్ నడిపిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ట్రాక్టర్‌కు ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ లేకపోవడాన్ని గుర్తించారు. ట్రాఫిక్ సీఐ నిత్యబాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



జయనిరూప్ (ఫైల్)

తప్పిదం ఎలా జరిగింది?

- కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌కు నోటీసు జారీ
- పీవీకేఎన్‌లో కొనసాగిన విచారణ

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన మోడల్ పేపరే... సెమిస్టర్ ప్రశ్నపత్రంగా ఇచ్చిన ఘటనపై సాక్షి దినపత్రికలో ఇదో సెమిస్టరీ శీర్షిక ఈ నెల 16వ తేదీన ప్రచురితమైంది. ఈ కథనంపై ఆ కళాశాల ప్రిన్సిపల్ జీవనజ్యోతి విచారణ ప్రారంభించారు. శనివా రం ఆ కళాశాలలో అధ్యాపకులతో అత్యవసర స మావేశం నిర్వహించారు. తప్పిదం ఎలా జరిగింద ని అందరినీ విచారించారు. ఆ కళాశాలలో పనిచేస్తున్న కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ నాగేంద్రకు నోటీసు జారీ చేశారు. నోటీసుకు స్పందించి తప్పిదం ఎలా జరిగిందన్న విషయంపై లిఖితపూర్వకంగా సమాధానం ఇవ్వాలని సూచించినట్లు సమాచారం. ఇది లాఉండగా ప్రశ్నపత్రాలు రూపొందించిన సెట్టర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. బీఓఎస్ పేపర్‌నే ప్రశ్నపత్రంగా ఇవ్వడంతో పరీక్షలకు కష్టపడి చదివిన విద్యార్థులు నష్టపోవాల్సి వస్తోందని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. పరీక్షలు ఇలా అలసత్వంతో నిర్వహిస్తే మెరిట్ విద్యార్థులు కష్టపడి చదివి ఉపయోగమేముందని ప్ర శ్నిస్తున్నారు. ఈ ఘటనపై మరింత లోతుగా విచారణ జరిపి, చర్యలు చేపట్టాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.